టెకీ యువతిపై అత్యాచారం కేసులో

## రెండో నిందితుడికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి (సర్కిల్‌లో నిందితుడు)

**వనస్థలిపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో రెండో నిందితుడు మునగాల శివాజీరెడ్డి అలియాస్ చింటూరెడ్డిని బుధవారం అర్ధరాత్రి గుంటూరు జిల్లా చిలుకలూరిపేటలో పోలీసులు అరెస్ట్ చేసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి వివరాలు వెల్లడించారు. జాబ్ వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని చిన్ననాటి స్నేహితుడైన ఎడ్ల గౌతమ్‌రెడ్డి ట్రీట్ ఇవ్వమని కోరాడు. ట్రీట్ ఇస్తున్న సమయంలో సదరు ఉద్యోగినికి బలవంతంగా మద్యం తాగించి అపస్మారకస్థితిలోకి వెళ్లగానే గౌతమ్‌రెడ్డి లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం అతని స్నేహితుడు శివాజీరెడ్డిని రప్పించి యువతిపై అత్యాచారం చేయించాడు. తీవ్ర రక్తస్రావమైన యువతి స్పృహలోకి వచ్చిన తర్వాత కేకలు వేయడంతో హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎడ్ల గౌతమ్‌రెడ్డిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. పరారీలో ఉన్న మరో నిందితుడు శివాజీ రెడ్డిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఏసీపీ కాశీరెడ్డి తెలిపారు.

### పెట్టుబడి పేరుతో మోసం.. మరో ఇద్దరు అరెస్ట్

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.6.05 కోట్ల మోసానికి పాల్పడిన ఓ ముఠాలోని ఇద్దరు సైబర్ నేరగాళ్లను ఇదివరకే అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న మరో ఇద్దరిని రాచకొండ సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. మాధవరం వంశీ కృష్ణారావు (35), తాటిపల్లి రాకేష్ (28), ధవళేశ్వరపు నవీన్‌కుమార్ (37), జెట్టి ఫణికుమార్ (34)లు ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ప్రచారం చేసుకున్నారు. ఆసక్తి చూపిన వారిని ఆర్7322 టీమ్ హార్వే పేరుతో టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. పెట్టుబడి పెట్టిన వారికి ముందుగా కొంత మొత్తం లాభం వచ్చినట్లు చూపేవారు. డబ్బు తన ఖాతాల్లో వేయించుకొని, యాప్‌లో డబ్బు పెట్టుబడి పెట్టినట్లు చూపేవారు. ఇలా పలువురిని మోసం చేసి రూ.6.05 కోట్లు వసూలు చేశారు. లాభాలు వచ్చినట్లు యాప్‌లో చూపినా, డబ్బు విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడం.. మోసగాళ్లు స్పందించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న రాచకొండ సైబర్ క్రైం పోలీసులు గతనెల 24న మాధవరం వంశీకృష్ణారావు, రాకేష్‌లను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న నవీన్‌కుమార్, జెట్టి ఫణికుమార్‌లను గురువారం అరెస్ట్ చేశామని సైబర్ క్రైం డీసీపీ అరవింద్‌బాబు తెలిపారు.

### వ్యభిచార ముఠా అరెస్టు

**చందానగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** అద్దె ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ముఠాను ఎస్‌వోటీ పోలీసులు, చందానగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శేరిలింగంపల్లి ఓల్డ్ ఎంఐజీ కాలనీలో రాజు అనే వ్యక్తి ఇంటిని అద్దెకు తీసుకొని కొన్నిరోజులుగా వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. గుర్తు తెలియని యువతీ యువకులు తరచూ వచ్చి వెళ్తుండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బుధవారం రాత్రి ఎస్‌వోటీ, చందానగర్ పోలీసులు ఇంటిపై దాడి చేసి ఇద్దరు విటులు, ఇద్దరు యువతులు, మూడు సెల్‌ఫోన్లు, రూ.2400 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు రాజు పరారీలో ఉన్నాడు.

### అనుమానాస్పదస్థితిలో విద్యార్థి మృతి

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** అనుమానాస్పదస్థితిలో ఓ విద్యార్థిని భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పేట్‌బషీరాబాద్ ఎస్‌ఐ సురేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. జీడిమెట్ల శాటిలైట్ టౌన్‌షిప్ ఈ-బ్లాక్‌లో నివాసముంటున్న ఎలాంగోవన్ సైంటిస్ట్. కుమార్తె రియాప్రియంవద (13) కొంపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. బుధవారం రాత్రి రియాప్రియంవద తమ్ముడితో కలిసి తన ఇంటి సమీపంలో సీ బ్లాక్‌లో ట్యూషన్‌కు వెళ్లింది. ట్యూషన్ పూర్తి కాగానే కుమారుడు ఇంటికి వచ్చాడు. రియా పెన్ తెచ్చుకోవడానికి మళ్లీ ట్యూషన్ వద్దకెళ్లి తిరిగి రాలేదు. కంగారుపడిన తల్లిదండ్రులు ట్యూషన్ టీచర్‌కు ఫోన్ చేసి ఆరాతీశారు. అంతలోనే సీ బ్లాక్ 7వ అంతస్తుపై నుంచి కింద పడిందని చెప్పారు. తీవ్రగాయాలతో ఉన్న కూతురిని వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

### స్కూల్ బస్సు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



కిషన్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

**దుండిగల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అన్నారానికి చెందిన ఎర్రోళ్ల కిషన్ (62) బతుకుదెరువు కోసం వలసవచ్చి మల్లంపేటలో ఓ భవన నిర్మాణం వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం పనులు ముగించుకొని తన సోదరుడి బైక్‌పై ఇంటికెళ్తుండగా కాజీపల్లి రోడ్డులో బ్రిడ్జి వద్ద బౌరంపేట శాంతినికేతన్ పాఠశాల బస్సు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కిషన్ రోడ్డుపై పడిపోగా అతని మీదుగా బస్సు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు.

### పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** వివాహం కావడం లేదన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్‌కు చెందిన విష్ణుప్రసాద్(35) బతుకుదెరువు కోసం కొంపల్లి గాంధీనగర్‌కు వలసొచ్చి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గతకొద్దిరోజులుగా పెళ్లి కావడం లేదని తల్లి వద్ద బాధపడుతుండేవాడు. గురువారం తల్లి పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

### విధులకు వెళ్లిన యువతి అదృశ్యం

**రాయదుర్గం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** గచ్చిబౌలి పోలిస్‌స్టేషన్ పరిధిలో ఉండే ఓ యువతి అదృశ్యమైంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సాయి శ్రీవాణి (19) మసీద్‌బండలోని సుదర్శన్‌నగర్ రోడ్డులో నివాసముంటోంది. అదే ప్రాంతంలో ఉన్న లంబ్నా అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ ఉమెన్‌గా పని చేస్తోంది. గతనెల 30న డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయల్దేరింది. అపార్ట్‌మెంట్‌కు వెళ్లని శ్రీవాణి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె తండ్రి శ్రీరాములు పరిసర ప్రాంతాలు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



టెంపుల్ బస్టాప్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు



బాలానగర్ ప్రధాన రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



ప్రగతినగర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళా నేతలు

# సీఎం వ్యాఖ్యలపై నిరసన హోరు

- బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- రేవంత్ క్షమాపణలకు డిమాండ్
- సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

**మియాపూర్/అల్లాపూర్/కేపీహెచ్‌బీకాలనీ/బాలానగర్/నిజాంపేట/ఓల్డ్‌బోయినపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** మహిళా ఎమ్మెల్యేల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబులు అగౌరవపరిచేలా మాట్లాడడంపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొన్నది. అనంతరం కొమిరిశెట్టి సాయిబాబా, రోజాదేవి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడుల గురించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రశ్నించడంతో సమాధానం చెప్పలేక దాన్ని డైవర్ట్ చేయడానికి సీఎం రేవంత్ వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఏ ముఖం పెట్టుకుని వచ్చారని డిప్యూటీ సీఎం అనడం ఏమిటని, మంత్రి శ్రీధర్‌బాబు మహిళలను కించపర్చేలా మాట్లాడారని తెలిపారు. అనంతరం పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, హరీశ్‌రావు, పురుషోత్తం యాదవ్, తిరుమలేష్, ఆంజనేయులు, ప్రవీణ్, శ్రీనివాసరావు, శ్రీధర్ ముదిరాజ్, రవియాదవ్, శేఖర్‌గౌడ్, కిరణ్‌యాదవ్, వాసు, యశ్వంత్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, సౌజన్య, విక్రం, హరీశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కార్పొరేటర్ సబీహ బేగం ఆధ్వర్యంలో అల్లాపూర్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కో-ఆర్డినేటర్ వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, సంజీవ, జ్ఞానేశ్వర్, హమీద్, అస్లం, చారి, సంపత్, మల్లేష్, విష్ణు, పార్వతి, దుర్గ, లక్ష్మి, సత్య, సైదమ్మ పాల్గొన్నారు.



సీఎం వ్యాఖ్యలను ఖండిస్తూ నినదిస్తున్న అల్లాపూర్ కార్పొరేటర్, నాయకులు



మియాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

#### ప్లకార్డులతో కార్పొరేటర్ల నిరసన

మహిళా ఎమ్మెల్యేలపై సీఎం వ్యాఖ్యలను తప్పుబడుతూ కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, శిరీష బాబూరావు, బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా టెంపుల్ బస్టాప్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు.

#### సీఎం క్షమాపణలు చెప్పాలి

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్, ప్రగతినగర్‌లలో పార్టీ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ల ఆదేశాల మేరకు ఈ నిరసన చేపట్టామని తెలిపారు. కొంపల్లి మున్సిపల్‌లో మాజీ ఎంపీపీ సన్నా కవిత నిరసన వ్యక్తం చేశారు. సీఎం వెంటనే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

#### బాలానగర్ ప్రధాన రహదారి వద్ద..

సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మహిళలను కించపర్చేలా మాట్లాడారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కేటీఆర్ పిలుపు మేరకు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్ ప్రధాన రహదారి బోజై ఫంక్షన్ హాల్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

#### ఓల్డ్‌బోయినపల్లిలో..

అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలనుద్దేశించి సీఎం మాట్లాడిన తీరు సరైనది కాదని ఓల్డ్‌బోయినపల్లి బీఆర్ఎస్ నాయకులు సూచించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క వీరంగం

**16 మంది చిన్నారులను కరిచిన వైనం**



కుక్క కాటుతో గాయాలపాలైన చిన్నారులు

**బాలానగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** బాలానగర్‌లో ఓ పిచ్చికుక్క గురువారం సాయంత్రం వీరంగం సృష్టించింది. బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ, సాయినగర్, వినాయకనగర్, చరబండ రాజునగర్, కల్యాణ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎదురుపడ్డ చిన్నారులను, ఇండ్ల ముందు ఆడుకుంటున్న పిల్లలను కరిచింది. 16 మందికి కాట్లు వేయడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళనతో ఆస్పత్రులకు పరుగులు తీశారు. ఈ విషయం వాట్సప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో స్థానికులు కంగారుపడుతూ ఇండ్లకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి కూకట్‌పల్లి సర్కిల్ ఇన్‌చార్జి వెటర్నరీ అధికారి నాగార్జునకు సమాచారం అందించారు. చివరకు బల్దియా సిబ్బంది పిచ్చికుక్కను బంధించారు. అయితే, 16 మందిలో తీవ్రగాయాలైన నలుగురిని నారాయణగూడ ఫీవర్ ఆస్పత్రికి, 12 మందిని స్థానిక బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు నాగార్జున తెలిపారు.



కృష్ణ మాదిగ చిత్రపటానికి నాయకుల క్షీరాభిషేకం

### సుప్రీంకోర్టు తీర్పుపై హర్షాతిరేకం

**హైదర్‌నగర్ /గచ్చిబౌలి/పేట్‌బషీరాబాద్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడంపై మాదిగ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 50 ఏళ్ల సుదీర్ఘ సమస్యకు సుప్రీంకోర్టు పరిష్కారం చూపించిందని ఎమ్మార్పీఎస్ జేఏసీ గ్రేటర్ అధ్యక్షుడు రాజు అన్నారు. శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం 30 ఏళ్లుగా నిలబడానికి మాదిగల సంకల్ప బలం, సమాజం అందించిన అండదండలే ప్రధాన కారణమని ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు అశోక్‌మాదిగ అన్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు.

### చెరువుల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

- అధికారులకు ఎమ్మెల్యే గాంధీ ఆదేశం



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

**హైదర్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** వానాకాలం నేపథ్యంలో అసంపూర్తిగా మిగిలిన చెరువుల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. చెరువుల సుందరీకరణ, అభివృద్ధి పనుల పురోగతిపై గురువారం ఆయన ఇరిగేషన్ అధికారులతో వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. హైదర్‌నగర్ డివిజన్ అంబీర్‌చెరువు, కిందికుంట, ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. చెరువులో కలుషిత నీరు చేరకుండా జరుగుతున్న డ్రైనేజీ మళ్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అధికారులు నరేందర్, ఏఈ విశ్వం తదితరులు పాల్గొన్నారు.

### లేక్‌వ్యూ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నార్నె

**హైదర్‌నగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాసకాలనీ లేక్‌వ్యూ విల్లాస్‌లో నెలకొన్న పలు సమస్యలు, అభివృద్ధి పనుల గురించి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు గురువారం కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలో పూర్తి చేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

#### సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

మాదాపూర్ డివిజన్ గోకుల్‌ప్లాట్స్‌కు చెందిన నాగరాజు అత్యవసర వైద్య చికిత్స కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి నార్నె సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు.

#### త్వరలో చేపట్టనున్న పనుల పరిశీలన

వివేకానందనగర్ డివిజన్ వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరం నగర్ వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నోఏళ్ల సమస్య త్వరలో తీరనుందని, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నుంచి మాధవరం నగర్ కాలనీ హైటెన్షన్ లైన్‌కింద నాలా మీద కల్వర్టు నిర్మాణంతో స్థానికులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు.

### ఆపరేషన్ ముస్కాన్‌లో

## 1175 మంది చిన్నారులను కాపాడిన అధికారులు

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి:** భిక్షాటన చేస్తున్న పిల్లలు, బాల కార్మికులను కాపాడేందుకు పోలీసులు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ 10వ ఎడిషన్‌లో హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 1175 మంది చిన్నారులను రక్షించారు. కార్మిక శాఖ, రెవెన్యూ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్‌లైన్, పోలీసులు, ఎన్‌జీవోలు సంయుక్తంగా జూలై 1 నుంచి జూలై 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 25 బృందాలు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 524 మంది పిల్లలను కాపాడారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు 317 మంది కాగా.. మిగతా 207 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారని పోలీసులు తెలిపారు. పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై 20 కేసులు నమోదు చేసి, మిగతా వారికి రూ.11.21 లక్షలు జరిమానా విధించారు. అలా గే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 651 మంది చిన్నారులను కాపాడారు. వీరిలో 618 మంది బాలురు, 33 మంది బాలికలు ఉన్నారు.

#### సమస్యల పరిష్కారమే లక్ష్యం : కూన

**గాజులరామారం :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రోడ్డు విస్తరణపై మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడంపై పలువురు గ్రామస్తులు గురువారం శ్రీశైలం గౌడ్‌ను కలిశారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని సూచించారు.



గద్దర్ వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ, క్రాంతికిరణ్, గుమ్మడి సూర్యకిరణ్

### 6న గద్దర్ వర్ధంతి సభ

**పంజాగుట్ట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** ప్రజాయుద్ధనౌక గద్దర్ ఒక వ్యక్తి కాదు శక్తి అని పలువురు వక్తలు అన్నారు. గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ గుమ్మడి సూర్యకిరణ్ అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 6న జరిగే గద్దర్ ప్రథమ వర్ధంతి సభ పోస్టర్‌ను తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్‌రెడ్డి, వేములపాటి అజయ్, సీఎల్ యాదగిరి, ఏపూరి సోమన్న, ప్రొఫెసర్ ప్రభంజన్ యాద వ్, తదితరులు ఆవిష్కరించారు.

### నేటి సీఎం సభకు హాజరుకావాలి

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరిగే సీఎం సభకు హాజరుకావాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కోరారు.

### ఏఐ సామర్థ్యాలతో కొత్త ఆవిష్కరణలు



ఒప్పందపత్రాలను సుజాత కుమారస్వామికి అందజేస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** భారతదేశంలోని వైద్యుల క్లినికల్ అనుభవాలకు ఏఐ సామర్థ్యాలను జోడించడం ద్వారా ఆరోగ్య సంరక్షణను పునర్వ్యవస్థీకరించే ఒక ప్రణాళిక కోసం ఏఐజీ ఆస్పత్రితో ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) పరస్పర ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గురువారం ఏఐజీ ఆస్పత్రిలో ఒప్పందంపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పేరుతో రూపొందించే ఈ కార్యక్రమం కొత్త ఆవిష్కరణలు, పద్ధతులు, రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐఎస్‌బీలోని పరిశోధన సంస్థ అయిన మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ (ఎంఐహెచ్‌ఎం) ఈ కార్యక్రమంలో ప్రధాన భాగస్వామిగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్, డిజిటల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజాత కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు చేపట్టాలి

**కవాడిగూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి వారికి న్యాయం చేయాలని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ జేఏసీ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన, ఆవేదన కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి మాట్లాడారు. గత తెలంగాణ ప్రభుత్వం మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

### వాచ్‌మన్ కుమార్తెకు ఆర్థిక సహాయం

**కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** ఇంటర్‌లో 985 మార్కులు సాధించిన వాచ్‌మన్ యడ్లపల్లి అంజనేయ ప్రసాద్ కుమార్తె ప్రతిభకు సాయిధనమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందజేసింది. గురువారం వసంతనగర్ మహిళా మండలి ఆధ్వర్యంలో సదరు విద్యార్థినికి రూ.35వేల నగదు అందజేశారు. సీతా మనోహరి, బాల, పద్మ, సుశీల, లక్ష్మీ భవాని తదితరులు పాల్గొన్నారు.



### ప్రధాన రహదారులను శుభ్రంగా ఉంచాలి

**గచ్చిబౌలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** ప్రధాన రహదారులను శుభ్రంగా ఉంచాలని, దీనిపై సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలని ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నల్లగండ్ల నుంచి గోపన్‌పల్లి, ఖాజాగూడ, గచ్చిబౌలి మీదుగా బొటానికల్ గార్డెన్ రోడ్డు, మసీద్‌బండ వరకు పనులు పరిశీలించారు. రోడ్డు అంచుల్లో మట్టి పేరుకుపోతున్నదని, పనులు సక్రమంగా చేయాలని సూచించారు. పనుల పర్యవేక్షణకు కొత్తగా సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. అంతర్గత రహదారులతోపాటు ప్రధాన రహదారులు స్వచ్ఛతకు ప్రతీకగా ఉండాలని స్పష్టం చేశారు.



గాజులరామారం డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి, ఇతర నాయకులు.

-గాజులరామారం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి)

### త్వరగా పనులు పూర్తి చేయాలి

- జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో పర్యటించారు. డివిజన్‌లోని మహానగర్, వెంకటేశ్వరనగర్, వెన్నెలగడ్డ తదితర ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న రహదారులు, పార్కులను పరిశీలించారు. జడ్సీ వెంట కుత్బుల్లాపూర్ డీసీ నర్సింహ, ఈఈ లక్ష్మీగణేష్, భార్గవ్‌నారాయణ, సిబ్బంది ఉన్నారు.

### నసీరుద్దీన్‌షా దర్గా ఉర్సుకు ఏర్పాట్లు పూర్తి

**ఓల్డ్‌బోయినపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** ఓల్డ్‌బోయిన్‌పల్లి ప్రధాన రహదారి పక్కన ఉన్న నసీరుద్దీన్‌షా దర్గా వద్ద రెండు రోజులపాటు జరిగే ఉర్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ తెలిపారు. రెండు రోజులుగా ఉత్సవాలకు కావాల్సిన ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, అఫ్సర్, చందు, దర్గా ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

### ప్రజాపాలన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రతి వార్డులో ఒక్కోటి ఏర్పాటు
- జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

**గచ్చిబౌలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో ప్రతి వార్డుకు ప్రజా పాలన కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటిని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ కేంద్రాల్లో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాల మేరకు గురువారం ఆయన జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ ప్రజాపాలన కేంద్రాలు ఉదయం 10 గంటల నుంచి పనిచేస్తాయని, ప్రజలు తమ సమస్యలపై ఇక్కడ వినతిపత్రాలు సమర్పించవచ్చన్నారు. సమస్యలను వెంటనే అధికారులకు చేరవేయాలని, సమస్యల సత్వర పరిష్కారం జరిగేలా చూడాల్సిన బాధ్యత డీసీలపై ఉందన్నారు. దోమల నివారణ కోసం నిత్యం ఫాగింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాణిజ్య సముదాయాల్లో ప్రత్యేకంగా చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని, ప్రతి ఇంటికి స్వచ్ఛ ఆటో వెళ్లేలా చూడాలని సూచించారు. రోడ్లపై గోతులను తక్షణమే పూడ్చాలని, ఈనెల 15లోపు పనులన్నీ పూర్తిచేయాలని ఆదేశించారు.